# అందరికీ ఓటరు స్లిప్పులు అందాలి

- స్లిప్పుల పంపిణీ పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాలి
- పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ ఏర్పాట్లు పూర్తిచేయాలి
- సీ-విజల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంతోష్ కుమార్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

మెదక్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ప్రతి ఓటర్‌కు ఓటరు స్లిప్పులు అందేలా కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం సీఈవో కార్యాలయం హైదరాబాద్ నుంచి ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. దీనికి అవసరమైన మేరకు యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉండే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతను వెబ్ క్యాస్టింగ్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఓటరు స్లిప్పులు అందలేదని, గతంలో అనేక ఫిర్యాదులు ఉన్నాయని, వీటి నివారణకు ఎన్నికల కమిషన్ ముందస్తుగా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిందన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు స్లిప్పులు ముద్రించి, పకడ్బందీగా వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పర్యవేక్షణ కోసం నోడల్ అధికారులను నియమించుకోవాలని తెలిపారు. ఓటరు స్లిప్పుల పంపిణీలో ఫిర్యాదులుంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తుగా తెలపాలని, బీఎల్ఏలను ఓటరు స్లిప్పుల పంపిణీలో భాగస్వామ్యం చేయాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీపై రోజూ నివేదికలు సమర్పించాలన్నారు. ప్రతీ ఓటరుకు తప్పనిసరిగా ఓటరు స్లిప్పు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యల వివరాల రిజిస్టర్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, వారి అనుచరులకు సి-విజల్ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. సి-విజల్ యాప్‌ను విస్తృతంగా వినియోగించడంతో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ, కోడ్ ఉల్లంఘనలను అరికట్టేందుకు ఉపయోగపడుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పా ల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలోని 34-మెదక్ , 37 నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ముద్రణ పూర్తయ్యిందని, పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈడీఎం సందీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**మీడియా సెంటర్ పరిశీలన**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్

మెదక్ అర్బన్, నవంబర్14: ఎన్నికల నియామావళిలో భాగంగా మంగళవారం ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను సాధారణ, వ్యయ, పోలీస్ పరిశీలకుడు సంతోష్‌కుమార్ తుకారం పరిశీలించారు. అనంతరం జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును, సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్ పనితీరు మీడియాలో వచ్చే వార్తలు, పేయిడ్ న్యూస్, పత్రికప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పనితీరును జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. కలెక్టర్‌ను నియోజకవర్గంలో ఉన్న బ్యాంకు అకౌంట్ సమాచారం, ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు జమైన వారి అకౌంట్ సమాచారం, వాటి వివరాలు, జీఎస్‌టీ అకౌంట్‌లా వివరాలు, ఇప్పటివరకు సీజ్ అయిన డబ్బు, మద్యం, నమోదైన కేసుల వివరా లు, అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని, జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు ఉన్నారు.

## నర్సాపూర్‌లో బీజేపీకి బిగ్ షాక్

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి రాజీనామా**



నర్సాపూర్‌లో రాజీనామా పత్రాలను చూపిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, నాయకులు

నర్సాపూర్, నవంబర్ 14 : నర్సాపూర్ బీజేపీకి బిగ్‌షాక్ తగిలింది. నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తీరును నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, మున్సిపల్ కౌన్సిలర్, 231 మంది శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, రెండు మండలాల అధ్యక్షులు మూకుమ్మడిగా రాజీనామాలు చేసి బీజేపీకి పెద్ద ఝలక్ ఇచ్చారు. ఈ సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా రెండు సార్లు పోటీ చేశానని గుర్తుచేశారు. అప్పట్లో ఉన్న సిద్ధాంతాలు పార్టీలో ఇప్పుడు లేవని వెల్లడించారు. స్వార్థపూరితమైన రాష్ట్ర నాయకులు వాళ్ల స్వప్రయోజనం కోసం పార్టీ సిద్ధాంతాలు తెలియని వ్యక్తులకు టికెట్లు ఇప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ ప్రకటించిన 23 రోజుల నుంచి బీజేపీ అభ్యర్థి మురళీ యాదవ్ కనీసం ఓటెయ్యమని అడగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో 8 స్థానాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన, బీజేపీ సిద్ధాంతాలు తెలియని వ్యక్తులకు టికెట్ కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తనతో పాటు కౌన్సిలర్, 231 మంది శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, రెండు మండలాల పార్టీ అధ్యక్షులు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. కేవలం మెదక్ జిల్లానే కాకుండా వేరే జిల్లాలు కూడా ఇదే అసంతృప్తితో ఉన్నారని అన్నారు. బీజేపీ కంచుకోటైన కూకట్‌పల్లి టికెట్ జనసేనకు అమ్ముకోవడం దారుణమని వెల్లడించారు. ఈటల రాజేందర్ సిద్ధాంతాలను పక్కన పెట్టి కులరాజకీయాలు చేస్తున్నాడని, కులాల మధ్య పంచాయతీలు పెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీనామాను అధిష్టానానికి పంపిస్తామని వెల్లడించారు. వేరే పార్టీలోకి వెళ్లేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. బీజేపీ నాయకులు బాల్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## ప్రశ్నిస్తే దాడులా ?

- ఎలక్షన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదు..
- గాయ పడిన దళిత యువకుడు కొలుపుల దినేశ్



రుక్మాపూర్‌లో దినేశ్‌పై దాడి చేస్తున్న సమయంలో అడ్డుకుంటున్న పోలీసులు

చేగుంట, నవంబర్ 14 : ఎలక్షన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదు.. పట్టాలు ఇప్పిస్తానంటివి ప్రశ్నిస్తే దాడులు చేపిస్తారా.. నేను సామాన్య మనిషిగా అడుగుతుంటే దాడి చేసి తరమి కొడుతారా.. రుక్మాపూర్‌లో చెరువులో పడి ముగ్గురు చనిపోతే కనీసం ఎమ్మెల్యే పరామర్శించిన పాపాన పోలేదు.. ఎమ్మెల్యేతో మాట్లాడేందుకు ప్రయాత్నిస్తే కార్యకర్తలతో దాడి చేయిస్తారా అని గాయపడిన దినేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా చేగుంట మండలంలో బీజేపీ ప్రచారంలో ఉద్రిక్తత చోటు చేసుకున్నది. మండలపరిధిలోని రుక్మాపూర్ గ్రామాల్లో దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వచ్చారు. ఈ క్రమంలో రఘునందన్‌రావుతో ప్రచారంలో మాట్లాడుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు కొలుపుల దినేశ్ గత ఉప ఎన్నికల్లో పట్టాలు ఇప్పిస్తాన్నవు అన్న విషయమై మాట్లాడేందుకు ప్రయత్నం చేయగా, పక్కనే బీజేపీ నాయకులు అతడిపై దాడి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని గొడవ జరుగకుండా ఇరువర్గాలను చెదరగొట్టారు. తమపై దాడి చేయడం ఏమిటిని,ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి అడిగే హక్కు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## పకడ్బందీగా చెక్‌పోస్ట్‌ల నిర్వహణ

**మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని**

నర్సాపూర్, నవంబర్14 : జిల్లాకు అక్రమంగా డబ్బు, మద్యం ఇతర వస్తువులు రానీయకుండా పకడ్బందీగా చెక్‌పోస్ట్‌ల నిర్వహణ చేపడుతున్నామని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని వెల్లడించారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని మల్లన్న గుడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, టెక్మాల్ పరిధిలోని బొడ్మట్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వాహన తనిఖీలు చేసిన వాహన నమోదు చేసిన రిజిష్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

**CHANGE OF NAME**

★ I, Munigela Sangameshwar, S/o. Munigela Sudarshan, R/o. H.No. 13-34/2, Thirumalapur Road, Near Sanskar School, Shankarampet- A, Shankarampet (A) (M), Medak Dt., In my SSC Memo K126871 (Roll No. 0497547), my name mentioned as M. Sangameswer, S/o. Sudarshan. Correct name is Munigela Sangameshwar
NT-320551

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## అల్లాదుర్గంలో ఘోర రోడ్డు ప్రమాదం

- బస్సు ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం.. ఒకరికి తీవ్రగాయాలు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన క్రాంతికిరణ్

అల్లాదుర్గం, నవంబర్ 14 : మెదక్ జిల్లా అల్లాదుర్గం పరిధిలోని రాంపూర్ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. అతి వేగంగా దూసుకువచ్చిన బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మణం చెందారు. ఈ ప్రమాదం అల్లాదుర్గం మండల పరిధిలోని రాంపూర్ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం సీతానగర్‌కు చెందిన చిన్నోళ్ల సాయి (13), లింగాయిపల్లి విజయ్ (16), అజయ్ బైక్‌పై రాంపూర్ నుంచి సీతానగర్ వెళ్తున్నారు. అదే సమయంలో అల్లాదుర్గం వైపు నుంచి పిట్లం వెళ్తున్న బాన్సువాడ డిపోకు చెందిన బస్సు వేగంగా వెళ్తున్నది. ఈ క్రమంలో రాంపూర్ అండర్ ప్రాసింగ్ బ్రిడ్జి వద్ద బైక్‌ను ఢీకొట్టింది. దీంతో చిన్నోళ్ల సాయి, లింగాయిపల్లి విజయ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కోపోద్రిక్తులై బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన నేషనల్ హైవే పెట్రోలింగ్ వాహనాన్ని సైతం గ్రామస్తులు ధ్వంసం చేశారు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు తరలించారు. ఈ మేరకు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

**పరామర్శించిన ఎమ్మెల్యే క్రాంతికిరణ్**

ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఈ విషయాన్ని తెలుసుకుని ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకున్నారు. కోపోద్రిక్తులుగా ఉన్న గ్రామస్తులకు నచ్చజెప్పి వారిని శాంతింపజేశారు. కుటుంబాలను ఓదార్చిన వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



ఓదారుస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్